AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatoday.in

06-6-2026 NIZAMABAD / KAMAREDDY PAGES - 2


## మాజీ ఎమ్మెల్యేకు తృటిలో తప్పిన ప్రమాదం



**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్ :** మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్తాకు తృటిలో ప్రమాదం తప్పింది. ఆయన ప్రయాణిస్తున్న కారును కంటైనర్ ఢీకొట్టింది. భిక్కనూరు వద్ద జాతీయ రహదారిపై శనివారం ఈ ప్రమాదం చోటు చేసుకుంది. జాతీయ రహదారిపై భిక్కనూరు వద్ద ఆయన ప్రయాణిస్తున్న కారును వెనుక నుంచి కంటైనర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అదృష్టవశాత్తు మాజీ ఎమ్మెల్యేకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. రహదారిపై భారీగా ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



## బ్యాక్ వాటర్‌లో ప్రకృతి సోయగం..

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ బ్యాక్‌వాటర్ ప్రాంతం ఆహ్లాదకరమైన పచ్చిక బయళ్లు, ప్రకృతి అందాలకు నిలయంగా అలరారుతోంది. బ్యాక్ వాటర్ పరిసరాల్లోని పచ్చికలో జింకలు స్వేచ్ఛగా తిరుగుతూ పర్యాటకులను కనువిందు చేస్తున్నాయి. దీంతో ఈ అందాలను తిలకించేందుకు పర్యాటకులు తరలివస్తున్నారు. – అక్షరటుడే, ఆర్మూర్



## ఫిర్యాదులపై తేల్చేనా!

కామారెడ్డి కాంగ్రెస్‌లో గ్రూపు రాజకీయాలు భగ్గుమంటున్నాయి. పార్టీ సీనియర్ నేత, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, నియోజకవర్గ నాయకుడు, టీపీసీసీ జనరల్ సెక్రెటరీ గడ్డం చంద్రశేఖర్ రెడ్డి వర్గాల మధ్య మాటల యుద్ధం కాస్త ఫిర్యాదుల దాకా వెళ్లింది. హిందూ శ్మశాన వాటిక అంశంతో మొదలైన వివాదం ఇప్పుడు పార్టీని రెండుగా చీల్చింది. దాంతో కామారెడ్డి కాంగ్రెస్ విబేధాలు గాంధీ భవన్ మెట్లెక్కాయి.

- అక్షరటుడే, కామారెడ్డి

- కాంగ్రెస్‌లో అంతర్గత పోరు
- గడ్డం చంద్రశేఖర్‌కు క్రమశిక్షణ కమిటీ నోటీసులు
- షబ్బీర్ అలీపై ఫిర్యాదులు
- కామారెడ్డి కాంగ్రెస్‌లో రచ్చకెక్కుతున్న విబేధాలు
- అధిష్ఠానం నిర్ణయంపై ఉత్కంఠ



కామారెడ్డి పట్టణంలో హిందూ శ్మశాన వాటిక అభివృద్ధికి ఓ స్వచ్ఛంద సంస్థ ముందుకు రావడం రాజకీయ రగడకు కారణమైందని ప్రచారం సాగుతోంది. శ్మశాన వాటిక అభివృద్ధిని 'మూడు నక్కలు' అడ్డుకుంటున్నాయని చంద్రశేఖర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు దుమారం రేపగా, ఆయనపై గాంధీ భవన్‌లో పలువురు కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేశారు.

### అధిష్ఠానానికి తలనొప్పి

పోటాపోటీ ఫిర్యాదులు, తీవ్రమైన వ్యక్తిగత ఆరోపణలతో కామారెడ్డి కాంగ్రెస్ పార్టీ అంతర్గత విబేధాలు రచ్చకెక్కాయి. స్థానిక సంస్థల ఎన్నికలు ముంచుకొస్తున్న వేళ ఇద్దరు నేతల మధ్య వివాదం పార్టీకి తలనొప్పిగా మారింది. ఇప్పుడు అధిష్టానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనన్న ఉత్కంఠ క్యాడర్‌లో నెలకొంది. ఇద్దరు ముఖ్య నేతలు పార్టీకి కావాల్సిన వాళ్లే కావడంతో అధిష్టానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనన్న ఉత్కంఠ కొనసాగుతోంది. దీక్ష చేస్తామని హెచ్చరించడం, ఎవరు కావాలో అధిష్టానమే తేల్చుకోవాలన్న షబ్బీర్ అలీ వర్గం నేతల వ్యాఖ్యలు పార్టీ అధిష్టానాన్ని ఇరుకున పడేస్తున్నాయన్న టాక్ రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది.

### అధికార పార్టీలో అలజడి

చంద్రశేఖర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు షబ్బీర్ అలీని కించపరిచేలా ఉన్నాయని, ఆ వ్యాఖ్యల వల్ల పార్టీకి డ్యామేజీ జరుగుతోందని పేర్కొంటూ షబ్బీర్ అలీ వర్గం పీసీసీ క్రమశిక్షణ కమిటీకి ఫిర్యాదు చేసింది. ఆయనపై కేసులు ఉన్నాయని, పలువురిని బెదిరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పార్టీలో ఆయన ఉంటే డ్యామేజీ తప్పదని చంద్రశేఖర్ రెడ్డిని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేసింది.

### బీఆర్ఎస్ కోవర్టు

చంద్రశేఖర్ రెడ్డి వర్గం ఫిర్యాదుతో షబ్బీర్ అలీ వర్గం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. చంద్రశేఖర్ రెడ్డి బీఆర్ఎస్‌కు కోవర్టుగా పని చేస్తున్నారని, ఆయన పార్టీలో చేరడం వల్లే ఆయనపై ఉన్న వ్యతిరేకత కాంగ్రెస్ పార్టీ ఓటమికి కారణమైందని మండిపడింది. తక్షణమే అతన్ని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేసింది. వారం రోజుల్లో చర్యలు తీసుకోకపోతే వెయ్యి మందితో గాంధీ భవన్ వద్ద దీక్ష చేస్తామని హెచ్చరించింది. అంతటితో ఆగకుండా మూకుమ్మడి రాజీనామాలు చేస్తామని షబ్బీర్ అలీ అనుచరులు సంచలన వ్యాఖ్యలు చేశారు.



### షోకాజ్ నోటీసులు

షబ్బీర్ అలీ వర్గం చేసిన ఫిర్యాదుపై స్పందించిన క్రమశిక్షణ కమిటీ ఈ నెల 4న చంద్రశేఖర్ రెడ్డికి షోకాజ్ నోటీసు జారీ చేసింది. తన వ్యాఖ్యలపై ఈ నెల 11 లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించింది. అయితే అదే రోజు చంద్రశేఖర్ రెడ్డి వర్గం ఎదురు దాడికి దిగింది. షబ్బీర్ అలీపై క్రమశిక్షణ కమిటీకి ఫిర్యాదు చేసింది. పార్టీలో గ్రూపు తగాదాలకు షబ్బీర్ అలీ ఆజ్యం పోస్తున్నారని ఆరోపించింది. షబ్బీర్ అలీ కుటుంబం అవినీతికి పాల్పడుతోందని, గతంలో కామారెడ్డిలో సీఎం రేవంత్ రెడ్డి ఓటమికి షబ్బీర్ అలీ కుటుంబ సభ్యులే కారణమని తీవ్ర ఆరోపణలు చేసింది.

## ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకే గ్రామ, వార్డు సభలు




**అక్షరటుడే నిజామాబాద్ సిటీ:** సంక్షేమ పథకాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకే ప్రభుత్వం పంచాయతీల్లో గ్రామ సభలను, మున్సిపల్ పట్టణాలలో వార్డు సభలను నిర్వహిస్తోందని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. వర్ని మండలం హుమ్నాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం సర్పంచ్ అప్పిరెడ్డి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వ్యవసాయ రంగంలో నిజామాబాద్ జిల్లా అరుదైన ఘనతను కలిగి ఉందని కలెక్టర్ గుర్తు చేశారు. పరిస్థితులకు అనుగుణంగా పంటల మార్పిడి విధానాన్ని అవలంభిస్తూ సాగు రంగంలో ప్రత్యేకతను చాటాలని రైతులకు సూచించారు. ఎల్‌నినో ప్రభావం వల్ల తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నందున, తక్కువ సాగు నీటి అవసరం కలిగిన పంటలను విత్తుకోవాలని సూచించారు. ప్రభుత్వం నోటిఫై చేసిన ఆయా పంట రకాలనే సాగు చేయాలని, నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. నకిలీ, నాసిరకం విత్తనాలను విక్రయించే డీలర్ల లైసెన్సులు రద్దు చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. గ్రామ సభలో బోధన్ ఆర్డీవో విజయలక్ష్మి, మండల ప్రత్యేక అధికారి మధుసూదన్, ఏసీపీ శ్రీనివాస్, డీఎల్పీవో శ్రీనివాస్, తహశీల్దార్ ప్రశాంత్, స్థానిక అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



## పైప్‌లైన్ పనుల్లో వేగం పెంచాలి

**నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా**

**అక్కడటుడే, నిజామాబాద్ సిటీ:** నగరంలోని మిర్చి కాంపౌండ్‌కు వెళ్లే దారిలో నూతనంగా వేస్తున్న మంచినీటి పైప్‌లైన్ పనుల్లో వేగం పెంచాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అధికారులను ఆదేశించారు. శనివారం నగరంలోని మార్వాడి గల్లీ మిర్చి కాంపౌండ్ వద్ద కొనసాగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మంచినీటి పైప్‌లైన్ లీకేజీ కావడంతో మురికి నీరు చేరి కలుషితం అవుతున్నాయన్నారు. దీంతో నూతన పైప్‌లైన్ పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. గత 30 ఏళ్లుగా ఉన్న పైప్‌లైన్ శిథిలావస్థకు చేరడంతో దెబ్బతిన్నాయన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న నూతన పైప్‌లైన్ పనులను నాణ్యతతో చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, వీలైనంత తొందరగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షించాలన్నారు. ఎమ్మెల్యే వెంట కార్పొరేటర్లు బంటు ప్రీతి ప్రవీణ్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగోల్ల లక్ష్మీనారాయణ, మఠం పవన్, నాయకులు పవన్ తదితరులు ఉన్నారు.




## మెడికల్ కళాశాలలో విద్యార్థినిపై లైంగిక వేధింపులు

**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాలలో విద్యార్థినిపై లైంగిక వేధింపుల ఘటన కలకలం రేపింది. సదరు విద్యార్థిని ఈ వేధింపులు తాళలేక ఆత్మహత్యాయత్నం చేసినట్లు తెలుస్తోంది. దీంతో పోలీసులు సదరు వైద్యుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని మెడికల్ కళాశాలకు అనుబంధంగా ఉన్న నర్సింగ్ కళాశాలలో చదువుతున్న విద్యార్థినిని ట్యూటర్‌గా పనిచేస్తున్న గౌతం లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. వాట్సప్, ఇన్‌స్టాగ్రామ్‌లలో మెసేజ్‌లతో వేధించడంతో మనస్తాపానికి గురైన ఆ విద్యార్థిని నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం చేసింది. వెంటనే స్పందించిన తోటి విద్యార్థినులు ఆమెను చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. అనంతరం సమాచారం అందుకున్న పోలీసులు విచారణ జరిపి సదరు ట్యూటర్ గౌతంపై కేసు నమోదు చేశారు. అయితే గౌతం ప్రస్తుతం పరారీలో ఉన్నాడని త్వరలోనే అరెస్ట్ చేస్తామని ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. నిందితుడి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. ఈ విషయమై మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణ మోహన్ మాట్లాడుతూ.. బాధితురాలు పిర్యాదు చేసిన వెంటనే స్పందించామన్నారు. ట్యూటర్ గౌతంను పూర్తిగా విధుల్లోంచి తొలగించామని తెలిపారు. విద్యార్థినులు వేధింపులకు గురైతే తక్షణమే తమను సంప్రదించాలని సూచించారు. ర్యాగింగ్, వేధింపుల నిరోధానికి డిసిప్లినరీ యాక్షన్ కమిటీ పనిచేస్తోందని.. మెడికల్ కళాశాలలో ఇలాంటి ఘటన జరగడం బాధాకరమన్నారు.

## 20న జాతీయ లోక్ అదాలత్

**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** ప్రజల న్యాయ సంబంధిత సమస్యలను త్వరితగతిన పరిష్కరించడానికి నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగ పరచుకోవాలని సీపీ సాయి చైతన్య పేర్కొన్నారు. ఈనెల 20న లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇందులో చిన్న చిన్న కేసులు, ట్రాఫిక్ చలానాలు, మైనర్ క్రిమినల్ కేసులు, సివిల్ తగాదాల వంటి వివాదాలు లోక్ అదాలత్ ద్వారా సులభంగా పరిష్కారం పొందవచ్చన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకుని న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను తక్కువ సమయంలో ముగించుకోవచ్చన్నారు. అంతేకాకుండా.. ఇది ఒక శాంతియుత పరిష్కార విధానం కాబట్టి.. ఇరుపక్షాలు పరస్పర అంగీకారంతో సమస్యలు పరిష్కరించుకునే అవకాశం ఉందని తెలిపారు.

## ఫీల్డ్ అసిస్టెంట్, ఆశ వర్కర్ల కోసం తీర్మానం..

**అక్షరటుడే, కోటగిరి :** పోతంగల్ మండలంలోని కొల్లూర్ గ్రామంలో శనివారం మండల స్పెషల్ ఆఫీసర్ మున్ని నాయక్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫీల్డ్ అసిస్టెంట్, ఆశ వర్కర్లు లేరు, ఐకెపి భవనం కావాలని తీర్మానం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు స్పెషల్ ఆఫీసర్‌కు విన్నవించగా ఆయన ఉన్నతాధికారులకు సమాచారం అందిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం స్కూల్ భవన నిర్మాణం పెండింగ్‌లో ఉందని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డికి విన్నవించగా ఆయన రూ.5లక్షలు మంజూరు చేస్తానని సర్పంచ్ లోని జగన్‌కు హామీ ఇచ్చారు. వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించాలని సూచించారు. కార్యక్రమంలో ఉప్పు రవి, ఏవో శంకర్, సెక్రెటరీ రంజన, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



## సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ: సీపీ

**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను కట్టడి చేయవచ్చని సీపీ సాయి చైతన్య అన్నారు. ఆర్మూర్‌లో శనివారం ఏర్పాటు చేసిన ప్రజాపలన ప్రగతి కార్యక్రమంలో సీపీ పాల్గొన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని సీపీ అన్నారు. శాంతియుత వాతావరణం నెలకొని ఉన్న ప్రాంతాలు సత్వర అభివృద్ధి సాధిస్తాయని పేర్కొన్నారు. నేరాలు జరిగిన సందర్భాల్లో నిందితుల ఆచూకీ తెలుసుకునేందుకు సీసీ కెమెరాలు ఉపయోగపడుతాయన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాలు, దురలవాట్ల




కు యువత దూరంగా ఉండాలని హితవు పలికారు. రోడ్ సేఫ్టీ కమిటీని ఏర్పాటు చేసుకుని రోడ్డు ప్రమాదాల నియంత్రణ కోసం కృషి చేయాలన్నారు. ప్రజలకు భద్రతా కల్పించడానికి పోలీసు శాఖ ఎల్లవేళలా సమాయత్తంగా ఉంటుందని తెలిపారు.

## తహశీల్దార్ కార్యాలయం ముట్టడి

**అక్షరటుడే, కామారెడ్డి:** నెలలు గడుస్తున్నా కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం తరలించకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించి తమ నిరసన తెలిపారు. అధికారుల నిర్లక్ష్యాన్ని ఎండగడుతున్నారు. తాజాగా భిక్కనూరు తహశీల్దార్ కార్యాలయంలో రైతులు నిరసన తెలిపారు. లారీలు ఎక్కడెక్కడికి వెళ్తున్నాయి.. ఏ కేంద్రంలో పూర్తిస్థాయిలో ధాన్యం తరలించారో చెప్పాలని డిమాండ్ చేశారు. తహశీల్దార్ రైతులకు నచ్చజెప్పినా వినకపోవడంతో అడిషనల్ కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ధాన్యం 48 గంటల్లో తరలించే ఏర్పాట్లు చేస్తామని అడిషనల్ కలెక్టర్ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
2
నిజామాబాద్/కామారెడ్డి
శనివారం
6.6.2026
www.aksharatoday.in
AKSHARA TODAY



## పిప్రిలో తగలబెట్టిన ఇంటిని పరిశీలించిన సీపీ

**అక్షరటుడే, ఆర్మూర్ :** మండలంలోని పిప్రి గ్రామంలో తగలబెట్టిన ఇంటిని పోలీస్ కమీషనర్ సాయి చైతన్య శనివారం పరిశీలించారు. ఈ ఘటనకు దారితీసిన పరిస్థితులు.. బాధిత కుటుంబ పరిస్థితిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా బాధితుడు రాజమల్లు కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. అలాగే బాధిత కుటుంబానికి అవసరమైన సహాయ సహకారాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరిస్తున్నామని.. అన్ని కోణాల్లో విచారణ కొనసాగుతోందని తెలిపారు. సీపీ వెంట ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర రెడ్డి, ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్, సర్పంచ్ కిరణ్ తదితరులున్నారు.



ఉత్తర తెలంగాణకు జీవనాడి శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు నీటిమట్టం రోజురోజుకూ తగ్గిపోతోంది. ప్రస్తుతం ప్రాజెక్టులో నీరు డెడ్ స్టోరేజ్ స్థాయి 10 టీఎంసీల దూరంలో మాత్రమే ఉంది. ఎండాకాలంలో భానుడి భగభగలు.. బాబ్లీ నుంచి నీటి లభ్యత లేకపోవడంతో సాగర్ బోసిపోతోంది.
– అక్షరటుడే, ఆర్మూర్

# డెడ్ స్టోరేజీకి చేరువలో శ్రీరాంసాగర్

- 10 టీఎంసీల దూరంలో నీరు
- నీటి లభ్యతపై రైతుల్లో ఆందోళన
- భారీ వర్షాలపైనే రైతుల ఆశలు..

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పూర్తి నీటిమట్టం 1091 అడుగులు 80.5 టీఎంసీలుగా ఉంది. కాగా.. ప్రస్తుతం ప్రాజెక్టులో 15.880 టీఎంసీలు, 1064.90 అడుగులు నీటి నిల్వ ఉంది. ప్రాజెక్టు డెడ్ స్టోరేజీ 5 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 10 టీఎంసీల నీరుంది. గతేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 12.904 టీఎంసీలు, 1062.30 అడుగుల నీళ్లున్నాయి. ఈ లెక్కన గతేడాదితో పోలిస్తే రెండు టీఎంసీలు అదనంగా ఉంది. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 579 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా మిషన్ భగీరథ, ఆవిరి రూపంలో 916 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టులో నుంచి బయటకు వెళ్తుంది.

**రైతుల ఆందోళన..**

శ్రీరాంసాగర్ కాలువలపై ఆధారపడిన నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల రైతులు ఆందోళన చెందుతున్నారు. డెడ్ స్టోరేజ్ చేరుకుంటే లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలకు కూడా నీరు అందని పరిస్థితి ఏర్పడుతుందని వారు వాపోతున్నారు. ఇప్పటికే కాలువలకు ఇచ్చే నీటిని తగ్గించారు. అలాగే ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు ఆలస్యమైతే సాగు కష్టమవుతుందని వారు చర్చించుకుంటున్నారు.

**వర్షాలు... బాబ్లీ పైనే ఆధారం..**

ఎగువన మహారాష్ట్రలో భారీ వర్షాలు పడితే తప్ప ప్రాజెక్టుకు భారీగా నీరు వచ్చే అవకాశం లేదని అధికారులు చెబుతున్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జూలై 1 ఒకటి నుంచి అక్టోబర్ 28 వరకు బాబ్లిగేట్లు తెరిచి ఉంచనున్నారు. మోటారు పంప్‌ల ద్వారా నీటిని తోడుకునే అవకాశం లేని డెడ్ స్టోరేజ్‌ను చేరుకునే లోపు కాళేశ్వరం నుంచి అదనపు నీరు తరలించే ప్రయత్నాలు జరుగుతున్నట్లు మరో వైపు సమాచారం. నీరు తగ్గడంతో ప్రాజెక్టులో మునిగిపోయిన పాత దేవాలయాలు, ఇళ్ల శిఖరాలు బయటకు కనిపిస్తున్నాయి.

**పర్యాటక శోభ..**

శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో నీటిమట్టం తగ్గుతుండటంతో ప్రాజెక్టు వెనుక భాగంలో పర్యాటక శోభ సంతరించుకుంది. పచ్చికలో జింకలు స్వేచ్ఛగా తిరుగుతూ పర్యాటకులను కనువిందు చేస్తున్నాయి. ప్రాజెక్టులో మునిగిపోయిన పాత గ్రామాలు, దేవాలయాలు, కొండలు పైకి తేలడం ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్‌లో జింకల సంచారం అధికం కావడంతో వాటిని చూసేందుకు ప్రజలు క్యూ కడుతున్నారు.

## కేజ్‌వీల్స్‌తో రోడ్లపై తిరిగితే కఠిన చర్యలు



**అక్షరటుడే, లింగంపేట:** ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చించి రోడ్లు నిర్మిస్తే కేజ్‌వీల్స్‌తో వాటిని కొందరు రైతులు ధ్వంసం చేస్తున్నారని శెట్‌పల్లి సర్పంచ్ అట్టెం శ్రీను అన్నారు. శనివారం నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ.. కేజ్‌వీల్స్‌తో రోడ్లపై తిరిగితే అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. గ్రామంలో ప్లాస్టిక్ నిషేధాన్ని పూర్తిగా కొనసాగించాలని, ట్రాక్టర్ యజమానులు కేజ్ వీల్స్‌కు పట్టిలు బిగించుకోవాలని సూచించారు. అనంతరం గోదాం నిర్మాణానికి గ్రామస్తులు సమక్షంలో స్థలాన్ని ఎంపిక చేశారు. గ్రామ అభివృద్ధి కోసం పలు తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మన్నే బాలయ్య, పంచాయతీ కార్యదర్శి రవి పాల్గొన్నారు.



## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాలని ప్రచారం..

**అక్షరటుడే, కమ్మర్‌పల్లి:** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు శనివారం మండలంలోని వివిధ గ్రామాల్లో అడ్మిషన్ల కోసం ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఉదయం అల్పాహారంతో పాటు మధ్యాహ్న భోజనం పథకాన్ని ప్రవేశపెడుతున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారని వివరించారు. అంతేగాక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉచిత పాఠ్యపుస్తకాలు, అనుభవజ్ఞులైన అధ్యాపకులు, డిజిటల్ క్లాస్‌రూమ్స్, సైన్స్‌కు సంబంధించిన ప్రయోగశాలలు, ప్రతిరోజూ స్లిప్ టెస్టుల నిర్వహణ, వారాంతపు టెస్టులు, విద్యార్థుల మానసికోల్లాసానికి క్రీడల ప్రాధాన్యత, ఉంటాయని కళాశాల ప్రిన్సిపాల్ జైపాల్ రెడ్డి పేర్కొన్నారు. అడ్మిషన్ డ్రైవ్‌లో అధ్యాపకులు శ్రీహరి, గంగారాం, మురళి, వైష్ణవి, స్వాతి పాల్గొన్నారు.



## మహిళా భవన నిర్మాణానికి భూమి పూజ

**అక్షరటుడే మాక్లూర్:** మండలంలోని చిక్లిలో మంజూరైన నూతన మహిళా భవన నిర్మాణానికి శనివారం భూమిపూజ నిర్వహించారు. స్థానిక సర్పంచ్ భూమన్న ఆధ్వర్యంలో ఏవో బ్రహ్మానందం కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. రూ.10 లక్షలతో నిర్మించే భవన పనుల్లో నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. సకాలంలో పనులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సతీష్, కార్యదర్శి నవీన్, సీసీ పద్మావతి పాల్గొన్నారు.

## ఆర్య క్షత్రియ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

**అక్షరటుడే, కామారెడ్డి:** ఛత్రపతి శివాజీ పట్టాభిషేక మహోత్సవం సందర్భంగా పలువురు విద్యార్థులు, ఉద్యోగులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. పట్టణంలోని సాందీపని డిగ్రీ కళాశాలలో శనివారం పదో తరగతి, ఇంటర్‌లో 90శాతం మార్కులు సాధించిన విద్యార్థులకు, మెడిసిన్ ఇంజినీరింగ్‌లో సీటు సంపాదించిన విద్యార్థులు, వివిధ ఉద్యోగాలు సాధించిన యువకులతో పాటు స్థానిక సంస్థలలో కామారెడ్డి జిల్లా పరిధిలో సర్పంచులు, ఉపసర్పంచులు, కౌన్సిలర్లుగా గెలుపొందిన వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఛత్రపతి టీచర్స్ సొసైటీ అధ్యక్షుడు లోకోటి వెంకట కృష్ణారావు మాట్లాడుతూ.. గత 12 ఏళ్ల నుంచి ప్రతిభా పురస్కారాలు అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు అన్ని రంగాల్లో విజయం సాధిస్తూ అనుకున్న లక్ష్యాలను సాధించాలని కోరారు. ఆర్య క్షత్రియ సంఘం జిల్లా అధ్యక్షుడు నిట్టు వెంకట్రావు మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత స్థానంలో ఉండాలంటే



ఓపికతో చదివి లక్ష్యాలను చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో కామారెడ్డి పట్టణ ఆర్య క్షత్రియ అధ్యక్షుడు బాలాజీ గారి బాలాజీ రావు, సీటీఎస్ ప్రధాన కార్యదర్శి మధు, కోశాధికారి కమలాకర్ రావు, మాజీ జడ్పీటీసీ సభ్యులు పడిగల రాజేశ్వరరావు, ఎంఈవో నిట్టూరి ఆనంద్ రావు, అంబీర్ మనోహర్ రావు, సుమిత్రా ఆనంద్ రావు, కామారెడ్డి మున్సిపల్ కౌన్సిలర్లు నిట్టూరి గంగాధర్ రావు, కౌన్సిలర్ భోజన్న గారి వినోదరాజు పాటిల్, ఎస్‌ఆర్‌కే ప్రిన్సిపల్ దత్తాద్రి, వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

## గాంధారి విశ్వబ్రాహ్మణ సంఘం కార్యవర్గం ఎన్నిక

**అక్షరటుడే, గాంధారి:** మండల విశ్వబ్రాహ్మణ సంఘం కార్యవర్గాన్ని జిల్లా విశ్వబ్రాహ్మణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఎన్నుకున్నారు. కమిటీ ఆధ్వర్యంలో మండల విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడిగా కమ్మరి సురేష్, ఉపాధ్యక్షులుగా వడ్ల నారాయణ, వడ్ల వెంకటేశం, వడ్ల రమేష్, వడ్ల ప్రభాకర్, ప్రధాన కార్యదర్శిగా ఆవుసుల శ్రీకాంత్ ఎన్నికున్నారు. అలాగే కార్యదర్శులుగా కమ్మరి సాయిలు, వడ్ల చిన్న విఠల్, వడ్ల హన్మాండ్లు, కోశాధికారిగా వడ్ల చందును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు పాల్గొన్నారు.



## పెంచిన ఎరువుల ధరలను వెంటనే తగ్గించాలి

**అక్షరటుడే, ఆర్మూర్:** తక్షణమే తగ్గించాలని ఏఐయూకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వి.ప్రభాకర్ డిమాండ్ చేశారు. పట్టణంలోని డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.




ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రైతులపై కక్షగట్టి కార్పొరేట్లకు అనుకూలంగా చర్యలు తీసుకుంటుందన్నారు. క్రమక్రమేనా వ్యవసాయ రంగాన్ని మొత్తం కార్పొరేట్ల చేతిలో పెట్టడానికి కుట్రపడుతుందని ఆయన ఆరోపించారు. అందులో భాగంగానే ఎరువుల ధరలను ఒక్కో బస్తాపై రూ.300 నుంచి రూ.500 వరకు పెంచి రైతుల వెన్ను విరిచిందన్నారు. అటు తర్వాత సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియాకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి దేవారం, జిల్లా కార్యదర్శి కిషన్, గంగారాం, రాజన్న, శేఖర్ సాయులు, పోషన్న, గంగాధర్, రమేష్, బద్రి తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు పరామర్శ




**అక్షరటుడే, కమ్మర్‌పల్లి:** మండలంలోని హాసాకొత్తూరు గ్రామంలో పలు బాధిత కుటుంబాలను రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ ఛైర్మన్ మానాల మోహన్ రెడ్డి పరామర్శించారు. కాంగ్రెస్ కార్యకర్త వడ్ల రమేష్ తండ్రి ఇటీవల మరణించగా వారి కుటుంబ సభ్యుల్ని పరామర్శించారు. మాజీ సర్పంచ్ ఏనుగు రాజేశ్వర్ తండ్రి ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను మానాల ఓదార్చారు. ఆయన వెంట వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచ్‌లు, మండల అధ్యక్షులు, మండల మాజీ అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

## మంజీరలో మునిగి ముగ్గురి మృతి..

### అంత్యక్రియలకు హాజరైన జాజాల

**అక్షరటుడే, లింగంపేట:** బాన్సువాడ మండలం బుడిమి వద్ద మంజీర నదిలో నీట మునిగి శుక్రవారం ముగ్గురు మృతి చెందిన విషయం తెలిసిందే. అందులో తల్లీ కూతురు ఉన్నారు. వారిరువురు లింగంపేట మండలం పర్మల్ల గ్రామానికి చెందిన వారు కావడంతో గ్రామంలో





విషాద ఛాయలు అలుముకున్నాయి. వారి అంత్యక్రియలు శనివారం నిర్వహించగా ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ హాజరై బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. లింగంపేట మండలం పర్మల్లకు చెందిన కొడబోయిన అనిత తల్లిగారిల్లు అయిన పిట్లం మండలం కిష్టపూర్‌కు వెళ్లారు. తల్లి ఇంటి వద్ద నిర్వహించే పండుగకు వెళ్లి అక్కడే మంజీర నదిలో ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందారు. అనిత కూతురు శివాని కామారెడ్డిలోని మైనారిటీ గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతుందని.. చదువు, ఆటల్లో చురుకుగా ఉండేదని గ్రామస్థులు పేర్కొన్నారు. ఇటీవల గ్రామంలో నిర్వహించిన హిందూ సమ్మేళనంలో ఆమె చేసిన నృత్యం గ్రామస్థులను ఎంతో ఆకట్టుకుందని గుర్తు చేసుకున్నారు.

## సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు పాటించాలి

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** వానాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు పాటించాలని పట్టణంలోని 6వ వార్డు కౌన్సిలర్ గఫార్ సూచించారు. శనివారం వార్డులో సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వార్డులో ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇంటి ముందు నీరు నిల్వలేకుండా చూసుకోవాలన్నారు. సీజన్ వ్యాధులు వ్యాపించకుండా జాగ్రత్త పడాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, మేనేజర్ వాసంతి, పీఏసీఎస్ వైస్ ఛైర్మన్ ప్రశాంత్ గౌడ్, మాజీ ఎంపీటీసీ షెకావత్ అలీ, పద్మారావు కాశీరాం పాల్గొన్నారు.



## ప్రీ ప్రైమరీ స్కూళ్లలో దరఖాస్తుల ఆహ్వానం..

**అక్షటుడే, పెద్ద కొడప్‌గల్ :** మండలంలోని పెద్దకొడప్‌గల్, కాస్లాబాద్ ప్రాథమిక పాఠశాలలో 2026-27కు గాను ప్రీప్రైమరీ పాఠశాలల్లో బోధకులు, ఆయాలుగా పనిచేసేందుకు నోటిఫికేషన్ జారీ అయిందని ఎంఈవో ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. ఈనెల 9వ తేదీలోగా ఆయా ప్రాథమిక పాఠశాలలలో లేదా మండల విద్యా వనరుల కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

## ప్రీప్రైమరీ స్కూళ్లలో ఇన్‌స్ట్రక్టర్ల నియామకానికి.. దరఖాస్తు ఆహ్వానం

**అక్షరటుడే, ఆర్మూర్:** ప్రైమరీ పాఠశాలల్లో ఇన్‌స్ట్రక్టర్ల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ఆర్మూర్ ఎంఈవో రాజగంగారం, ఆలూరు ఎంఈవో నరేందర్ వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఆర్మూర్ మండలంలోని కోమన్‌పల్లి, మగ్గిడి, ఇస్సపల్లి, ఫతేపూర్, ఆలూరు మండలంలో ఆలూరు, కల్లెడి, గుత్ప, మచ్చర్ల ప్రాథమిక పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ స్కూళ్లు మంజూరైనట్లు వారు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.